ప్రజాశక్తి

సోమవారం 16 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సాయి శ్రేయాస్ ఫార్మా ప్రమాదంపై

సమగ్ర దర్యాప్తు ఏదీ ?

సాయి శ్రేయాస్ కంపెనీలో ప్రమాదం జరిగిన ప్రాంతం (ఫైల్ ఫొటో)

◆ అడుగడుగునా యాజమాన్య నిర్లక్ష్యం

◆ కానరాని గ్యాస్ డిటెక్టర్లు, సెన్సార్లు

◆ ప్రాథమిక అంచనాలకే పరిమితమైన అధికారులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పరవాడ ఫార్మాసిటీ (రాంకీ)లోని సాయి శ్రేయాస్ (ఎస్ఎస్) మందుల కంపెనీలో ఈ నెల 11న జరిగిన ప్రమాద ఘటన ఫార్మా రంగంలో భద్రతా లోపాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. ఆ రోజు రాత్రి ఇద్దరు సేఫ్టీ అధికారులు పగిరి చంద్రశేఖర్, శరగడం కుమార్ మరణించడం పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల డొల్లతనాన్ని, ప్రమాద నివారణ చర్యల లోపాలను బట్టబయలు చేసింది. అయితే, ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు కొరవడింది. హైడ్రోజన్ సల్ఫైడ్ (హెచ్2ఎస్) వాయువు పీల్చడంతో మృతిచెందినట్లు అధికారులు తమ విచారణలో ప్రాథమిక అంచనాకు వచ్చినప్పటికీ నిర్ధారణకు రావడానికి తగిన సాక్ష్యాధారాల్లేవు. ప్రమాదం నుంచి బయటపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెల్పర్ నుంచి స్టేట్‌మెంట్ తీసుకొని పలుకోణాల నుంచి విచారణ చేపడితేగానీ ప్రమాద వాస్తవాలు తెలీవని నిపుణులు అంటున్నారు. అత్యంత తక్కువ మోతాదులో (0.0005 పిపిఎం - 0.1 పిపిఎం) హెచ్2ఎస్ వాయువును గుర్తించగలిగినప్పుడు ఆ ప్రదేశానికి సేఫ్టీ అధికారులు ఎందుకు వెళ్తారన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి.

యాజమాన్య నిర్లక్ష్యం

సేఫ్టీ అధికారుల మృతికి యాజమాన్య నిర్లక్ష్యం కారణమని విచారణాధికారులు గుర్తించారు. సాయి శ్రేయాస్ కంపెనీలో రసాయన వ్యర్థాలను ఎఫ్లూయెంట్ స్టోరేజ్ ప్లాంట్‌కు పంపి, అక్కడి నుండి రాంకీ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలిస్తారు. రసాయన వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసేటప్పుడు ప్రమాదాలు జరగకుండా యాజమాన్యం తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సివుంది. కానీ సాయి శ్రేయాస్ కంపెనీలో విష వాయువులు విడుదలయ్యే అవకాశం ఉన్న ప్రాంతంలో గ్యాస్ డిటెక్టర్లు, సెన్సార్లు ఏర్పాటు చేయకపోవడం యాజమాన్య నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. డిటెక్టర్లు ఉండి ఉంటే అధిక మోతాదులో విష వాయువులు విడుదలైనప్పుడు కార్మికులు అప్రమత్తమై ప్రమాదాన్ని మిగతా 2లో..

నేడు విశాఖలో సిఎం విస్తృత పర్యటన

◆ రోజంతా బిజీబిజీ

◆ యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన, సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం విశాఖలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 10:40 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఆయన చేరుకుంటారు. అక్కడి నుంచి 10:50 గంటలకు బయలుదేరి 11:10 గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత టెంపుల్ ప్రాంతానికి చేరుకుని ఈ నెల 21న తలపెట్టిన యోగా దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించనున్నారు. అనంతరం యోగా వేదికల వద్దకు వెళ్తారు. 12:15 గంటల నుంచి 1:30 గంటల వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై నోవాటల్ హోటల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. భోజన విరామం అనంతరం పిఎం.పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని పార్టీ కేడర్ సమావేశంలో పాల్గొంటారు. తదుపరి విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చి 5:35 గంటలకు విమాన మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్తారు.



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది

భద్రతా వాహన శ్రేణి ట్రయల్ రన్

సిఎం పర్యటన సందర్భంగా ముందస్తు భద్రతా వాహన శ్రేణి ట్రయల్ రన్‌ను ఆదివారం నిర్వహించారు. విశాఖ విమానాశ్రయం నుంచి సిఎం పర్యటించే నోవాటల్ హోటల్, ఆర్‌కె.బీచ్, ఎయు ఇంజినీరింగు కాలేజీ గ్రౌండ్స్, పిఎం.పాలెం ప్రదేశాల మీదుగా ఈ ట్రయల్ రన్ సాగింది. సిటీ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలక్టర్ మయూర్ అశోక్, డిసిపిలు అజిత, మేరీ ప్రశాంతి, ఆర్‌డిఒ శ్రీలేఖ విమానాశ్రయంలో వివిధ శాఖల అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

▶ వార్త 3లో..

బీమా ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలి

▶ వార్త 5లో..

నేడు విశాఖలో పిజిఆర్ఎస్ రద్దు

▶ వార్త 2లో..

మాట్లాడుతున్న జగ్గునాయుడు, చిత్రంలో వామపక్ష పార్టీల నాయకులు

17న పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన, సభ

విజయవంతానికి వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ అమానుష యుద్ధం, మానవ హననాన్ని నిరసిస్తూ ఈ నెల 17న ఉదయం 10 గంటలకు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దగల గురజాడ విగ్రహం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన, అనంతరం సభ జరుపనున్నట్టు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. ఆ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన వామపక్ష పార్టీల జిల్లా నాయకుల సమావేశంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రహమాన్, సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు కార్యదర్శి కె.దేవసహాయం, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, ఎం.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ పటం నుంచి పాలస్తీనా మిగతా 2లో..

మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయం

◆ ఒపి సేవలను విస్తృత పరిచాం

◆ వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు

◆ 'ప్రజాశక్తి'తో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కెజిహెచ్‌కు వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా తాను పనిచేయనున్నట్టు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఇటీవల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెను 'ప్రజాశక్తి' పలకరించగా పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

కెజిహెచ్‌కు వైద్యం కోసం వస్తున్న రోగులు ఒపి నుంచి వైద్య సేవలు పొందే వరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం మీ దృష్టికి వచ్చిందా ?

ఈ పరిస్థితి గతంలో ఉండేది. ఇప్పుడు అలా ఉండదు. రోగులకు సకాలంలో సరైన వైద్య సేవలు అందే విధంగా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. ముఖ్యంగా ఒపి సేవలను విస్తృతం చేశాం. వైద్యులు సమయపాలన పాటించేలా ఆదేశాలు జారీ చేశాం. నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది కూడా తప్పనిసరిగా సమయపాలన పాటించాలి.

ఒపిలో వైద్యులు ఏ విధంగా సేవలు అందించనున్నారు ?

ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, అలాగే మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు వైద్యులు కచ్చితంగా ఒపి సేవలకు అందుబాటులో ఉంటారు. అందుకు ఏర్పాట్లు చేశాం.

వైద్యులు, ఇతర సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ ఉంటోందా ?

దీనికి సరికొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చాం. రోగులకు వైద్య సేవలు అందించడంలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సాయి శ్రేయాస్ ఫార్మా ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు ఏదీ ?

నివారించగలిగేవారు. సేఫ్టీ అధికారులపై ప్రమాద నెపం నెట్టి తప్పించుకోవడానికి చేస్తున్న యాజమాన్య ప్రయత్నాలకు ప్రభుత్వ యంత్రాంగం తోడైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదంలో మరో అస్పష్టత ఏమిటంటే సల్ఫర్ పంపిన ఎంతసేపటికి సేఫ్టీ అధికారులు స్టోరేజ్ ట్యాంకు వద్దకు వెళ్లారు అన్నది స్పష్టంగా లేదు. వాస్తవానికి రసాయన ఉత్పత్తి ప్రక్రియలో విడుదలయ్యే వ్యర్థాలను గుర్తించి, వాటి స్థాయిలను ప్రాసెస్ సూపర్‌వైజర్లు నియంత్రించాల్సివుంది. కానీ, వారి పర్యవేక్షణ లేకుండా సేఫ్టీ అధికారులు ఎందుకు ఎఫ్లుయేంట్ స్టోరేజ్ ట్యాంక్ వద్దకు వెళ్లారు అన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. ఇద్దరు అధికారులు చనిపోవడంతో ప్రమాద తీవ్రతకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలు, మృతికి సంబంధించిన ప్రత్యక్ష సమాచారం లభించక అంచనాలతో దర్యాప్తు జరుగుతోంది.

ప్రమాద నియంత్రణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి : డాక్టర్ కె.బాబూరావు

ప్రమాదం నుంచి బయటపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెల్పర్ నుండి వాంగ్మూలం తీసుకుంటే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' ప్రతినిధి డాక్టర్ కె.బాబూరావు తెలిపారు. మందుల కంపెనీల్లో ప్రమాద నియంత్రణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, రక్షణ, భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయం

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నదీ లేనిదీ ప్రతిరోజూ తెలుసుకోవడానికి డిప్యూటీ సూపరింటెండెంట్‌తో పర్యవేక్షణ చేస్తున్నాం. సోమవారం నేను ప్రత్యేకంగా ఈ విధి నిర్వహణలో ఉంటాను. మిగిలిన రోజుల్లో డిప్యూటీ సూపరింటెండెంట్, కొందరు వైద్యులు ఈ పనిలో ఉంటారు.

ఇటువంటి విధులు నిర్వహించే వారు ఎవరో తెలియజేస్తారా ?

మంగళవారం ప్రొఫెసర్ ఎల్.లోకనాథరావు, బుధవారం డాక్టర్ మెహర్, గురువారం ప్రొఫెసర్ రాధాకృష్ణ, శుక్రవారం ప్రొఫెసర్ జి.వాసవిలత, శనివారం డాక్టర్ వి.రవి ఈ విధులను నిర్వహించి ఏ రోజుకు ఆ రోజు నివేదికను అందిస్తారు. వారిచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్తు చర్యలు ఉంటాయి.

రోగుల వైద్య సేవల పట్ల ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిసింది..నిజమేనా ?

నిజమే. ఐవిఆర్ కాల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రోగుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటోంది. తేడాలు ఉంటే వివరణ ఇవ్వాలని ఆదేశాలు వస్తున్నాయి.

మీ వైద్య రంగ ప్రస్థానాన్ని తెలియజేస్తారా ?

నేను ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థిని. ఇక్కడే చదువుకుని వైద్యురాలిగా పట్టా పొందడం, ఇక్కడే ప్రొఫెసర్‌గా పనిచేయడం విశేషం. ఇప్పుడు కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

17న పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన, సభ

దేశాన్ని తొలగించాలనే కుట్రతో ఇజ్రాయిల్ దాడులు చేస్తోందన్నారు. పిల్లలు, మహిళలతో సహా వేలాది మందిని బలి తీసుకుంటోందని తెలిపారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, శరణార్థుల శిబిరాలు.. ఇలా వేటినీ వదలడం లేదని, బాంబుల వర్షం కురిపిస్తోందని పేర్కొన్నారు. ఈ మారణ హోమాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ రెండింటినీ స్వతంత్ర దేశాలుగా గుర్తించడమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమని అభిప్రాయపడ్డారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుండి భారతదేశ విదేశాంగ విధానం అలీన విధానానికి కట్టుబడి పాలస్తీనాకు అండగా నిలుస్తోందని గుర్తుచేశారు. అయితే, కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీనికి తూట్లు పొడిచి అమెరికన్ సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా మారుస్తోందని, ఇది దేశ ప్రయోజనాలకు విఘాతమని అన్నారు. దీనిని విడనాడాలని డిమాండ్ చేశారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంబంధిత కార్యక్రమాల ఏర్పాట్లు, సమీక్షల నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా కార్యక్రమాలలో పాల్గొనాల్సి ఉన్నందున సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎంవిపి.కాలనీ : నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో తలపెట్టిన పిజిఆర్ఎస్‌ను కూడా రద్దు చేసినట్టు పోలీస్ కమిషనరేట్ అధికారులు తెలిపారు.

జివిఎంసి స్టాండింగ్ కమిటీ సమావేశం కూడా..

సిఎం విశాఖపట్నం పర్యటన సందర్భంగా జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించవలసిన జివిఎంసి స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని రద్దు చేస్తున్నట్టు జివిఎంసి కార్యదర్శి బి.వి.రమణ తెలిపారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులనూ భర్తీ చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెంగువ అచ్యుతరావు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం విశాఖ జిల్లా సమితి సమావేశం అల్లిపురంలోని సంఘ కార్యాలయంలో వై.రాంబాబు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కె.సందీప్, ఉపాధ్యక్షులు యు.నాగరాజు పాల్గొన్నారు.

మినిస్కస్‌ను కాపాడటంపై దృష్టిపెట్టాలి

ఆర్థోస్కోపీ శస్త్రచికిత్సల సదస్సులో డాక్టర్ శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/ఎంవిపి.కాలనీ : మినిస్కస్‌ను కాపాడటంపై ఆర్థోపెడిక్ వైద్యులు దృష్టిపెట్టాలని విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఆర్థోస్కోపీ శస్త్రచికిత్సల్లో వస్తున్న అత్యాధునిక విధానాలపై కిమ్స్ ఆసుపత్రి (సీతమ్మధార) ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమెరికాలో ఒక్కో వేలికి శస్త్రచికిత్స చేయడానికి కూడా స్పెషలైజేషన్ చేస్తున్నారని తెలిపారు. మన దేశంలోనూ అలా చేయాలని ఆకాంక్షించారు. సదస్సుకు ఆర్గనైజింగ్ ఛైర్మన్‌గా వ్యవహరించిన కెజిహెచ్ పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ ఆర్థోస్కోపీ వర్క్‌షాప్ ప్రాధాన్యతను వివరించారు. సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ గొల్లంగి శ్రీనివాస్, డాక్టర్ రాజేష్ కుమార్ రెడ్డి, డాక్టర్ సంతోష్ ఆర్ గడ్డం మాట్లాడుతూ జీవనశైలి లోపాలు, ఊబకాయం, అధిక శరీర బరువు, రోడ్డు ప్రమాదాలు, క్రీడల్లో జరిగే ప్రమాదాల కారణంగా మోకాళ్ల అరుగుదల చిన్న వయసువారిలోనూ ఎక్కువగా కనిపిస్తోందన్నారు. సాధారణంగా మోకాళ్ల అరుగుదల (నీ ఆర్థరైటిస్) అనేది 60-70 ఏళ్ల దాటిన తర్వాత ఉంటుందని, అయితే, పై కారణాలన్నింటి వల్ల అది 20 - 40 మధ్య వయసు వారిలో కూడా ఇటీవల ఎక్కువగా కనిపిస్తోందని అన్నారు. మోకాలిలో ఉండే లిగమెంట్లు, మినిస్కస్ గాయాలు అయినప్పుడు వీలైనంత త్వరగా స్పందించి తగిన వైద్యుడి వద్ద చూపించుకుని దానికి చికిత్స పొందాలని, లేకపోతే దీర్ఘకాలంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. ఈ తరహా గాయాలను ఆర్థోస్కోపీ ద్వారా నయం చేయొచ్చని, అందులో కూడా అత్యాధునిక టెక్నిక్‌లు వస్తున్నాయని తెలిపారు. విశాఖపట్నం కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఆర్థోపెడిక్ అసోసియేషన్, వైజాగ్ ఆర్థోస్కోపిక్ అసోసియేషన్‌ల సహకారంతో ఆర్థోస్కోపీ శస్త్రచికిత్సల్లో వస్తున్న అత్యాధునిక విధానాలపై నిర్వహించిన ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఉన్న 150 మందికిపైగా ఆర్థోపెడిక్ వైద్యులు హాజరయ్యారన్నారు.

అహ్మదాబాద్‌లోని అడ్వాన్స్ ఆస్పత్రి డైరెక్టర్ ప్రతిమేష్ జైన్, అహ్మదాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ రోహన్ వక్త, కోయంబత్తూరులో నాలుగు దశాబ్దాలుగా ఆర్థోస్కోపిక్ శస్త్రచికిత్సల్లో విశేష కృషి చేస్తున్న ఆర్థోవన్ ఆస్పత్రికి చెందిన వైద్యనిపుణుడు డాక్టర్ సంతోష్ సహానంద్ తదితరులు సదస్సులో పాల్గొని ఇటీవల కాలంలో మోకాళ్లకు సంబంధించి వస్తున్న వివిధ రకాల సమస్యలు, వాటిని నివారించే మార్గాలు, పరిష్కార నైపుణ్యాల గురించి సదస్సులో పాల్గొన్న వైద్యులకు వివరించారు.

సదస్సుకు హాజరైన వైద్యులతో సిపి శంఖబ్రత బాగ్చి

అపెరల్ పార్క్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేసే క్రమంలో విశాఖలోని ఆటోనగర్‌లోగల అపెరల్ పార్కును పునరుద్ధరించాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మేఘాలయ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2001లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఆటోనగర్‌లో అపెరల్ పార్క్ ఏర్పాటు చేశారని, 160 ఎకరాల్లో 150 మంది యూనిట్లు ప్రారంభించారని అన్నారు. ప్రస్తుతం 20 మంది మాత్రమే యూనిట్లు నడుపుతున్నారన్నారు. అచ్యుతాపురంలో బ్రాండిక్స్‌ను నడుపుతున్నట్టుగానే ఇక్కడా నడపవచ్చునని తెలిపారు. జాతీయ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ కార్పొరేషన్‌కు రెండు ఎకరాలు ఇస్తే మళ్లీ అపెరల్ పార్క్‌కు వైభవం వస్తుందని, యువత, మహిళలకు ఉపాధి దక్కుతుందని అన్నారు.

రాష్ట్రంలో కొన్ని జిల్లాలో పత్తి పంట అధికంగా ఉత్పత్తి అవుతోందని, స్పిన్నింగ్ మిల్స్ ప్రారంభిస్తే అన్ని జిల్లాలూ అభివృద్ధి అవుతాయని అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ వస్తున్న సందర్భంగా అపెరల్ పార్కు ఎందుకు మూతబడిందో దర్యాప్తు చేయాలని కోరారు.

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎతిహాద్ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు ఆదివారం స్కాలర్‌షిప్స్‌ను పంపిణీ చేశారు. వియంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, గౌరవ అతిథిగా మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎకె.ఖాన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎఎండి. ఇంతియాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ 175 మంది నిరుపేద విద్యార్థులకు రూ.17 లక్షల 50 వేలను ఇఎంసి వెల్ఫేర్ ద్వారా స్కాలర్‌షిప్ ద్వారా పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఎకె.ఖాన్ విద్యార్థులతో సంభాషించి భవిష్యత్తు ఆకాంక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమాధానాలు విని ఆయన సంతోషించారు. ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి విద్య అవసరమన్నారు. ఇఎంసి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఐహెచ్.ఫారూఖీ మాట్లాడుతూ ఈ సంక్షేమ సంఘం ద్వారా తాము చాలా సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, దానిలో భాగంగా ఈ స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. నిరుపేద పిల్లలను, వారి కుటుంబాలను ఆదుకోవడానికి తాము ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జాఫర్ హుసేన్, ట్రెజరర్ రియాజ్ ఖాన్ పాల్గొన్నారు.

సమస్యలపై ఆటో డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆదివారం రైల్వే స్టేషన్ పోస్ట్ ఆఫీస్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడారు. ఆటోడ్రైవర్ల పిల్లలందరికీ తల్లికి వందనం ఇవ్వాలన్నారు. ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారాలు వేసే జిఒ నెంబర్ 21, 31ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టాండ్ అధ్యక్షులు వై.వెంకట్, రవికృష్ణ, రమేష్, రాజేష్, గణేష్, నాగబాబు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE XIII ADDL.DISTRICT JUDGE CUM M.A.C.T AT : GAJUWAKA
M.O.P.639/2024
Between :
M Thirdha Ramalingeswara Rao & another ...**Petitioners**
And :
K Siva reddy & 2 others ...**Respondents**
NOTICE
To,
R-1: K. Siva Reddy,
S/o. Veera Reddy, Door No.24-82-4, Samatha Nagar, Kanithi Road, Gajuwaka, Visakhapatnam. (Driver of of the Concrete mixer Lorry bearing No.AP 31TT 5694)
Please take notice that the above Named petitioner has instituted the Above case against you and the same Stands posted to **14-07-2025** for you Appearance on that day you are personally Or through Advocate attend before the Hon'ble Court at **10:30 A.M**, falling which the matter will be heard and determined in your absence exparte, as per law.
R.D. BHASKARA RAO,
Advocate,
Visakhapatnam.
Cell: 9848548504.

ప్రభుత్వ విధానాలతో భవన నిర్మాణ కార్మికులకు కష్టాలు

ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-మధురవాడ : ప్రభుత్వ విధానాలు భవన నిర్మాణ కార్మికులను మరింత కష్టాలలోకి నెడుతున్నాయని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహాచారావు పేర్కొన్నారు. మధురవాడ శ్రీకృష్ణనగర్‌లోని ద్రోణంరాజు సత్యనారాయణ కళ్యాణ మండపంలో విశాఖ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంఘం సీనియర్ నాయకులు ప్రకాశరావు జెండాను ఆవిష్కరించారు. పి.సత్యనారాయణ నగర్, పందిరి రాము వేదికపై రాము, సత్యనారాయణ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ హాజరయ్యారు. సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు మూడేళ్ల నివేదికను ప్రవేశ పెట్టారు. నివేదికపై ప్రతినిధులు చర్చించారు. భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకుని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళతామని నిర్ణయించారు. అనంతరం ఆర్‌వి.నరసింహారావు మాట్లాడుతూ, కార్మికులకు గత పదేళ్ల నుంచి పని దొరకక తీవ్ర కష్టాలలో ఉన్నారని తెలిపారు. స్థానికంగా అనేక బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిలో స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, కార్మికులను బానిసలుగా మార్చడానికి మోడీ తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ అమలు చేసే విధానాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమలుకు పూనుకున్నారని తెలిపారు. 12 గంటల పనిదినాన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం నిర్ణయం చేస్తుందని, దానిని తిప్పి కొట్టడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని కోరారు. కూటమి ప్రభుత్వం వాటాతో కూడుకున్న పిఎఫ్, ఇఎస్ఐ భవన నిర్మాణ కార్మికులకు అమలు చేయాలని, సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సంక్షేమ నిధులు నుండి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాసభల సందర్భంగా కొమ్మాది కూడలి నుంచి మధురవాడ నగరంపాలెం రోడ్డు మీదుగా భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జ్యోతీశ్వరరావు, పోలేశ్వరరావు, పి.రాజుకుమార్, పి.వెంకటరావు, డి.అప్పలరాజు, ఎస్.రామప్పడు, జి.కిరణ్, జి.మంగశ్రీ, సిహెచ్.శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం - మృతుల్లో భార్యాభర్తలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో ఆదివారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలు మృతిచెందగా, ఆటో బోల్తా పడి మరొకరు దుర్మరణం చెందారు.

శ్రీహరిపురంలో నివాసం ఉంటున్న జొన్నాడ సాయి, జొన్నాడ శాలిని భార్యాభర్తలు. వీరిద్దరూ ఆదివారం ఉదయం శ్రీహరిపురం నుండి నగరానికి వెళ్తున్నారు. షీలానగర్ మారుతీ జంక్షన్ దగ్గర వెనుక నుంచి వస్తున్న కంటైనర్ వీరి వాహనాన్ని ఢీకొని, కొంత దూరం ఈడ్చుకొని వెళ్లిపోయింది. దీంతో భార్యాభర్తలిద్దరూ మృతిచెందారు. సాయి గాజువాక ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం పిఠాపురం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా పడి యువకుడు దుర్మరణం

ఆటో బోల్తా పడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన గాజువాక పంతులుగారు మేడ సమీపంలో చోటుచేసుకుంది. కణితి రోడ్డు ప్రశాంత్‌నగర్‌కు చెందిన బలగం సురేష్ (26), మరో ఐదుగురు కలిసి అద్దెకు ఆటో బుక్ చేసుకుని ఎన్ఎడి వెళ్తున్నారు. మార్గ మధ్యలో పంతులు గారి మేడ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవింగ్ సీటులో ఉన్న సురేష్ మృతిచెందాడు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎంవిపి.కాలనీ : ఇటీవల అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో చనిపోయిన వారికి శాంతి కలగాలని కోరుతూ ఆదివారం ఉదయం హెచ్‌బి కాలనీ చివరి బస్టాప్ వద్ద బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ మృతులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్ బాబ్జి, బిబి.గణేష్, పిఎస్‌వి.కుర్మేశ్, డి.రమణమూర్తి, ఎ.రామకృష్ణ, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాడుగుల: విమాన ప్రమాద మృతులకు మాడుగుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పడాల కొండలరావు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదాలను అరికట్టేందుకు కనీస చర్యలు కూడా తీసుకోకపోవడంపై మండిపడ్డారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన నాయకులు యేసురాజు, బుడబండి రాజు, పిల్ల అప్పారావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పెందుర్తి : విమాన ప్రమాద ఘటనలో మృతులకు 93వ వార్డు పరిధి నాయుడు తోట కృష్ణానగర్‌లో ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ (ఐహెచ్ఆర్‌సి) నేషనల్ ప్రధాన కార్యాలయం వద్ద ఆదివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐహెచ్ఆర్‌సి నేషనల్ ఛైర్మన్ రాజాన ప్రసాదరావు మాట్లాడుతూ, ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ నేషనల్ సెక్రటరీ ఆర్.ఇషిత, జాయింట్ ట్రెజరర్ కె.వరలక్ష్మి, ట్రెజరర్ ఆర్.విజయ, జి.అప్పలరాజు, టి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటకు ఏరువాక

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని 2025-26 సంవత్సరానికి ఖరీఫ్ పంట వేయడానికి ఆదివారం నియోజకవర్గస్థాయిలో ఏరువాక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు.కాంప్లెక్స్ సమీపంలోని రైతు పొలంలో నాగలి మేడు పట్టి దుక్కి దున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట విస్తీర్ణం 9867 ఎకరాల్లో సాగుతుందన్నారు. ఈ ఖరీఫ్ పంటకు అవసరమైన 2960 క్వింటాళ్ల విత్తనాలను ఏర్పాటు చేశామన్నారు. 47 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు 130 క్వింటాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. వ్యవసాయ యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తున్నామన్నారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇదే సమావేశంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కౌలు రైతులకు కార్డులు అందజేశారు.

బిఆర్.తాళ్లవలస, కృష్ణాపురం, పద్మనాభం గ్రామాల ఇనాం భూ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యేకు రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, తహశీల్దార్ కె.ఆనందరావు, వ్యవసాయ శాఖ ఎడి బి.విజయ్ కుమార్, జనసేన భీమిలి ఇన్‌చార్జి సందీప్‌కుమార్, కూటమి నాయకులు కె.రామస్వామి నాయుడు, కె.రమణ, కె.లీలావతి, కె.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి -గాజువాక : విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఉక్కు ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం పూర్వ అధ్యక్షులు గంట్యాడ పైడిరాజు అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో 34 ఏళ్లుగా విధులు నిర్వహించి ఈ నెల 30వ తేదీనఉద్యోగ విరమణ చేయనున్న జి.ఆనంద్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమం పెదగంట్యాడలో నిర్వహించారు. ఐఎన్‌టియుసి నాయకులు వైవి.రమణ మాట్లాడుతూ, గత 34 ఏళ్లుగా ఆనంద్ ఉక్కు కర్మాగారంలో విధులు నిర్వహించి కార్మిక వర్గానికి ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. ఉక్కు ప్రగతికి కృషిచేశారన్నారు. గంట్యాడ పైడిరాజు మాట్లాడుతూ ఆనంద్ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందారన్నారు. అనంతరం ఆనంద్‌ను పూల మాలలు, బొకేలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాడ నాగేశ్వరరావు, రాము, అప్పారావు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

గోల్ఫ్ కోర్టులో యోగాసనాలకు సన్నాహాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలో ఈ నెల 21న నిర్వహించే యోగా దినోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లలో భాగంగా ముడసర్లోవ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ కోర్టును కూడా ఆదివారం అధికారులు పరిశీలించారు. అవసరాన్ని బట్టి యోగా వేదిక కోసం సన్నాహాలు చేస్తున్నారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణం గల గోల్ఫ్ కోర్టులో సుమారు 40 నుంచి 50 వేల మంది యోగాలో పాల్గొనేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లును ఆదివారం జివిఎంసి జోన్ - 2 కమిషనర్ కనకమహాలక్ష్మి, అధికారులు గోల్ఫ్ కోర్టులో కలియతిరిగారు. గోల్ఫ్ కోర్టులో యోగాసనాల్లో పాల్గొనేందుకు నలుమూలలా ఉండే గేట్లును తెరిచేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చిన వాహనాల పార్కింగ్ కోసం హెల్త్‌సిటీలో ఉన్న ఖాళీ మైదానాన్ని ఉపయోగించనున్నట్లు జోనల్ కమిషనర్ తెలిపారు.

డంపింగ్ యార్డు ఎత్తివేయాలని వినతి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్‌లో డంపింగ్ యార్డు ఎత్తివేయాలని కోరుతూ డంపింగ్ యార్డు పోరాట కమిటీ ఆధ్వర్యంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆదివారం ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు సానుకూలంగా స్పందిస్తూ ఈ డంపింగ్ యార్డును తరలించే విధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. జులై 1వ తేదీ తర్వాత రెండు వారాలు లోపు ఈ డంపింగ్ యార్డు సందర్శనకు కలెక్టర్‌ను తీసుకొస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, రౌతు గోవిందరావు, వైసిపి నాయకులు మంత్రి శంకరనారాయణ, రంబ నారాయణమూర్తి , సిపిఎం నాయకులు ఎం.రాంబాబు, ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాల గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు కాలి సర్వం కోల్పోయిన దుంప అప్పారావు, రామయ్యమ్మకు జనసేన నాయకులు ఆర్థిక సహాయం చేశారు. సమాచారం తెలుసుకున్న జనసేన భీమిలి నియోజకవర్గం ఇన్చార్జి సందీప్ పంచకర్ల పిలుపు మేరకు గిడజాల పంచాయతీ నాయకులు కె.శంకరరావు, గణేష్, కంది సురేష్, కొమ్ము అప్పలరాజు, కోరాడ రమణ, రామకృష్ణ ఆధ్వర్యాన రూ.20 వేలు, రైస్ ప్యాకెట్, నిత్యావసర సరుకులను పార్టీ మండల అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు చేతుల మీదుగా కుటుంబానికి అందజేశారు. ఇంటి నిర్మాణానికి 1000 ఇటుక ఇస్తానని మండల అధ్యక్షులు అప్పలరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూర్తి, బాలు, శివకృష్ణ, సురేష్, రాజు, అల్లి రాజు పాల్గొన్నారు.

దివీస్‌కు అవార్డు

ప్రజాశక్తి -తగరపువలస : గుంటూరులోని బొమ్మిడాల కృష్ణమూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ రక్త దాతల దినోత్సవ వేడుకల్లో చిప్పాడ దివీస్ యూనిట్‌కు కార్డ్ ల్యాండ్ స్లైనర్ అవార్డు లభించినట్లు సంస్థ భద్రతా విభాగం ప్రతినిధి పి.మహేంద్ర ఆదివారం తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా మహేంద్ర అవార్డు అందుకున్నారు. దివీస్ యాజమాన్యం సుమారు 15 ఏళ్ల నుంచి ఏటా రక్త దాన శిబిరం నిర్వహించి 1000 యూనిట్లకు పైగా రక్తం, బ్లడ్ బ్యాంక్ కేంద్రాల ద్వారా రక్త గ్రహీతలకు అందిస్తున్నట్లు సంస్థ జిఎం వైఎస్ కోటేశ్వరరావు వివరించారు. తమ సంస్థ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

ఘనంగా లక్ష్మణరావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి -పద్మనాభం : వైసిపి మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు 47వ పుట్టినరోజును ఆదివారం పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు ఎస్.గిరిబాబు, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలను వైసిపి భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షులు సిరి సహస్ర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఇరు జట్ల మధ్య టాస్ వేసిన అనంతరం బ్యాటింగ్ చేసి ప్రీమియర్ లీగ్ సీజన్ 1 క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం సమకూరుతాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రాము నాయుడు, వైసిపి నాయకులు జీరు వెంకటరెడ్డి, బి.హరికిరణ్‌రెడ్డి, ఫుట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కరమాని చినబాబు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశ మందిరం ప్రారంభం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో రూ.38 లక్షలతో నిర్మించిన మండల సమావేశ మందిరాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు.

పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణలో ప్రతినిధులు

పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : శంకరమఠం రోడ్డులోని పద్మశాలి భవన్‌లో పద్మశాలి గ్లోబల్ యాప్‌ను ఆదివారం ఆవిష్కరించారు. విశాఖ జిల్లా పద్మశాలీల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బెంగళూరు ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీల కన్సల్టెంట్, టెక్నికల్ డైరెక్టర్ మేరువ వెంకటేశ్వర్లు, స్వాతి సైన్స్ ఛైర్మన్ కవరతపు ప్రసాదరావు, రో-ఎన్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ గోలి తిరుపతిరావు, కర్నూలు మాజీ ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ, ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ అభివృద్ధికి తామే బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. పద్మశాలీల అభ్యున్నతికి పద్మశాలీ గ్లోబల్ యాప్ ఎంతో ఉపయోగపడే డిజిటల్ వేదిక అన్నారు. భౌగోళిక సరిహద్దులు చెరిపి వేసి, గ్లోబల్ పద్మశాలి కుటుంబ నిర్మాణానికి దోహద పడుతుందన్నారు. ఎన్నో రంగాల్లో పద్మశాలీయులు అభివృద్ధి చెందినా, ఇంకా చాలామంది పేదరికంలో ఉన్నారన్నారు. పద్మశాలి సమాజ సమగ్ర అభివృద్ధికి ఈ యాప్ సహకరిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. నెట్వర్కింగ్ ద్వారా సాధికారత చేనేత శ్రామికులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, సేవా రంగ నిపుణులు, సంఘ సేవకులు అందరికీ ఉపయోగమని పేర్కొన్నారు. పరిచయ వేదిక, ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగ దాతలు, ఉద్యోగార్థులు ఈ వేదిక ద్వారా పరస్పర ప్రయోజనం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పద్మశాలి నాయకులు పప్పు రాజారావు, సూరిశెట్టి సూరిబాబు, బురిడీ కళ్యాణి, కొప్పల రమేష్, వానపల్లి ఈశ్వరరావు, రాపర్తి సుబ్బారావు, కొప్పల రామ్ కుమార్, కోడి దాసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే సివిల్స్‌లో విజయం

ప్రజాశక్తి-సీతమ్మధార : లక్ష్య సిద్ధి, పట్టుదల, ప్రణాళిక బద్ధమైన కృషితో చదివితే తొలి ప్రయత్నంలోనే సివిల్స్ విజయం సాధించవచ్చని ఆర్క్ రిఫ్లెక్స్ ఐఎఎస్ అకాడమి హెచ్ఓడి అడ్విన్ అవినాష్, డైరెక్టర్ వివేకానంద్ తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవన్లో సివిల్ సర్వీస్ పరీక్షలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీయ ప్రేరణ, సరైన గైడెన్స్ రెండేళ్ల పాటు చదివితే సివిల్స్ విజయం సాధించవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో సివిల్ సర్వీస్‌పై అవగాహన తక్కువగా ఉందన్నారు. సివిల్స్ ర్యాంకుల సంఖ్య ఏటేటా తగ్గుతూ వస్తుందన్నారు. గత ఏడాది వందలోపు ఒక్క ర్యాంకు కూడా రాలేదని, ఈ సంవత్సరం వందలోపు ఒక్క ర్యాంకు మాత్రమే వచ్చిందని తెలిపారు. తెలంగాణాలో ర్యాంకుల సంఖ్య ఏటా పెరుగుతూ వస్తున్నాయని తెలిపారు. ఆంధ్రాలో సివిల్ సర్వీసెస్‌పై అవగాహన తక్కువగా ఉందని, తక్కువ మంది విద్యార్థులు సివిల్స్ వైపు వెళ్తున్నారని తెలిపారు. తమ సంస్థ 2021లో హైదరాబాదులో స్థాపించామని, నాలుగేళ్లలో 68 ర్యాంకులు సాధించామని తెలిపారు. వీరిలో తొలి ప్రయత్నంలోనే ర్యాంకులు సాధించిన వారు ఉన్నారని తెలిపారు. స్వీయ ప్రేరణ, సరైన గైడెన్స్, కోచింగ్, క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావడం. క్లాస్ నోట్సు చదవడం, టెస్టులు రాయడం ఇలా ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే తొలి ప్రయత్నంలో విజయం సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అవినాష్, వివేకానంద్

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

డంపింగ్‌యార్డులో ఉన్న చెత్త

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్ డంపింగ్‌యార్డు కాలుష్యంతో స్థానిక ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సుమారు 16 గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. 2013వ సంవత్సరంలో చిన్న స్టాక్ యార్డుగా ఏర్పడిన ఈ డంపింగ్ యార్డ్, ప్రస్తుతం 200 నుండి 250 టన్నులు చెత్తను సేకరించి నిల్వ చేస్తున్నారు. 20 నుండి 30 రోజులు కుళ్లపెట్టి, ఎండబెట్టి ఆ తరువాత టన్నేజు ప్రకారం కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుని, ఉప్పాడ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఒకప్పుడు కేవలం గాజువాక, ప్రాంతంలో ఉన్న చెత్తను మాత్రమే ఇక్కడ ఉంచేవారు. ప్రస్తుతం మల్కాపురం నుండి షీలానగర్, అనకాపల్లి జిల్లాకు చెందిన లంకెలపాలెం వరకు సేకరించిన చెత్త మొత్తం ఇక్కడికే తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. జివిఎంసి మున్సిపల్ యాక్ట్ ప్రకారం నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో డంపింగ్ యార్డు ఉండాలని ఆంక్షలు ఉన్నప్పటికీ ప్రజల ప్రాణాలను లెక్క చేయకుండా, నగరం మధ్యలో డంపింగ్ యార్డును పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ డంపింగ్‌యార్డును ఇక్కడి నుండి తరలించాలని అధికారులకు, రాజకీయ నాయకులకు స్థానికులు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించుకున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప, డంపింగ్ యార్డు సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. రాజకీయ నాయకులు ఎన్నికల ముందు వచ్చి ఈ డంపింగ్ యార్డును తరలించే బాధ్యత తమదని చెబుతూ ఓట్లు వేయించుకున్నాక మొఖం చాటేస్తున్నారు. ఈ దుర్వాసన వల్ల చుట్టుపక్క గ్రామాలకు బంధువులు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. యువతీ యువకులకు పెళ్లి సంబంధాలు కూడా రావడంలేదని స్థానికులు ఆవేదనచెందుతున్నారు. ఈ మధ్యకాలంలో శ్వాస కోస వ్యాధుల భారిన స్థానికులు పడుతున్నారు. ఎన్నో ఆశలతో రూపాయిరూపాయి కూడా పెట్టుకుని సొంత ఇంటిని నిర్మించుకుంటే, ఈ డంపింగ్‌యార్డు వల్ల నివసించలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే చాలామంది గ్రామాలు విడిచి వేరే చోటకు తరలి వెళ్లిపోతున్నారు.

రాజకీయ నాయకులు ఈ డంపింగ్ యార్డు సమస్యను రాజకీయ ఎజెండాగా మాత్రమే వాడుకుంటున్నారు తప్ప, సమస్య పరిష్కారానికి ముందుకు రావడం లేదు. ఈ ప్రాంతంలో ఎక్కువగా రోజువారి కూలి పనులు చేసికొని బతికే వారు ఉన్నారు. దీంతో ప్రభుత్వాలు, అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. ఈ డంపింగ్ యార్డును తరలించాలని 16 గ్రామాల ప్రజలు ఐక్య పోరాటాలు చేస్తున్నారు.

డంపింగ్ యార్డు తొలగించాలి

డంపింగ్‌యార్డును తక్షణమే తొలగించాలి. గత ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హామీ ఇచ్చి వదిలేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే నెరవేరుస్తారని స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి 16 గ్రాముల ప్రజలు కలిసి ఐక్య పోరాటం చేయనున్నాం.

డి.రమణ,
సిపిఎం నాయకులు.

సొంతిల్లు ఉన్నా...

సొంతిల్లు ఉన్నప్పటికీ లాభం లేదు. రోజు వచ్చే దుర్వాసనను భరించలేక ఉక్కిరిబిక్కిరవుతున్నాం. గాలి ద్వారా విపరీతమైన దుర్వాసన వస్తుంది. దుర్వాసనతో తరచూ వ్యాధుల భారినపడుతున్నాం.

మీరాబాయ్,
స్వతంత్రనగర్.

తరచూ వ్యాధులు

ఈ డంపింగ్ యార్డు వల్ల విపరీతమైన దుర్వాసన, కాలుష్యంతో తరచూ చర్మ, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నాం. ప్రతిరోజూ అనారోగ్యంతో బాధపడుతున్నాం. ఇప్పటికైనా ఈ డంపింగ్ యార్డును తరలించాలి.

సంగీతలక్ష్మి,
రామచంద్ర నగర్.

చెత్తను తొందరగా తరలిస్తున్నాం

వచ్చిన చెత్తను వీలైనంత తొందరగా తరలిస్తున్నాం. గతంలో మాదిరిగా నిల్వ చేయడం లేదు.

డాక్టర్ కిరణ్
అసిస్టెంట్ హెల్త్ మెడికల్ ఆఫీసర్

పంచగ్రామాల సమస్యపై ధర్నా

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అజశర్మ

ప్రజాశక్తి-వేపగుంట : పంచ గ్రామాలు భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సింహాచలం జంక్షన్లో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ, ఈ సమస్యను పరిష్కరించాలంటే ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదన్నారు. ప్రభుత్వం అధీనంలోనే రెవెన్యూ, ఎండోమెంట్ విభాగాలున్నాయని, ఆ రెండు విభాగాలతో మాట్లాడితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు మాట్లాడుతూ, యువగళం పాదయాత్రలో నారా లోకేష్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 2019లో ఇచ్చిన జిఒ 229 అమలు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారం చేపట్టి ఏడాదైనా చర్యలు లేవన్నారు. కోర్టులో కేసు ఉందని, తీర్పు రాగానే పరిష్కరిస్తామని చెబుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించేలోపు ఇంటి నిర్మాణాలకు, మరమ్మతులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో విబివిఎన్.ప్రతాప్, బి.రమణి, సిహెచ్‌ఎస్ఎస్.గోపాలకృష్ణ, పి.రామారావు, సత్యనారాయణ, వై.నాగేశ్వరరావు, బి.శంకరరావు, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు లబ్ధిదారులకు అందజేశారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో 24, 43, 45, 49, 50, 55 వార్డులకు సంబంధించిన వడ్డమూరి దుర్గకు రూ.20 వేలు, సంతోషి కుమారికి రూ.39,046, గంధం కోటేశ్వరరావుకు రూ.43,584, టి.అప్పన్నకు రూ.20 వేలు, అప్పలనాయుడుకు రూ.1,80,630, సత్యనారాయణకు రూ.1,50,000, రాంబాబుకు రూ.89,462 రాధకుమారికి రూ.61,572, కళ్యాణ్ కుమార్‌కు రూ.19 వేలు, దేవికకి రూ.1,25,000, లక్ష్మీనారాయణకు 10 వేలు, కీర్తిశ్రీకి రూ.27,650 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎవరు అనారోగ్యం పాలైనా హాస్పిటలకు సంబంధించిన ఒరిజినల్ బిల్స్ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి పేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, వివిఎంఆర్‌డిఎ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, శ్యామల దీపిక, పరసురామరాజు, నజీర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన బంతులతో పచ్చని వనాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : విత్తన బంతులతో పచ్చని వనాలు పెరుగుతాయని పర్యావరణ సంరక్షణ గతివిధి సంస్థ విశాఖ మహానగర పర్యావరణ సంయోజక్ డాక్టర్ ఎస్‌పిబి.రంగాచార్యులు అన్నారు. నగరంలోని సీతమ్మధార కొండపైన పర్యావరణ సంరక్షణ గతివిధి, వనమాలి, సిటిజ, ప్లాంట్ ఎ హోప్, జెడి ఫౌండేషన్, రోటరీ, ఐఐఎం, ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ సొసైటి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒల నేతృత్వంలో విత్తన బంతులు చల్లారు. ఈ సందర్భంగా రంగాచార్యులు మాట్లాడుతూ, తమ ఆహారంగా భుజించిన పండ్ల విత్తనాలను ఒక చోట ఆరబెట్టి, తర్వాత పేడ మట్టి బూడిద కలిపి విత్తన బంతులు తయారు చేసి వర్షాకాలంలో కొండలపైన నది తీర ప్రాంతాల్లోనూ, చెరువు గట్ల మీద వేయాలని కోరారు.

ఘనంగా శ్రీశ్రీ వర్ధంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ సాహిత్యవేత్త, అభ్యుదయ కవి, రచయిత శ్రీశ్రీ వర్ధంతిని అడవివరం శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి నరసింహం, తెలుగు ఉపాధ్యాయులు లోవబాబు, దేముళ్ల పూలమాల వేసి నివాళులర్పించారు. చదువంటే మాకిష్టం కార్యక్రమంలో భాగంగా వ్యక్తిత్వ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు నేమాల హేమసుందరరావు మాట్లాడుతూ, వ్యక్తిత్వ వికాస ప్రక్రియకు దిక్సూచి శ్రీశ్రీ అన్నారు. శ్రీశ్రీ కవిత్వం బాలలకు సైతం అర్థమయ్యేలా ఉంటుందన్నారు. నాయుడు తోటకు చెందిన జివిఎల్.నరసింహమూర్తి తన కుమారుడు జి.వెంకటనాగసాయి నిరుపయోగంగా ఉన్న పోటీ పరీక్షలకు సంబంధించిన సుమారు 200 పుస్తకాలను గ్రంథాలయాధికారి నరసింహానికి అందజేశారు.

వృద్ధుల పట్ల మానవతతో మెలగాలి

మాట్లాడుతున్న రమేష్

ప్రజాశక్తి- అనకాపల్లి : సమాజంలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబం లోని వృద్ధుల పట్ల మానవత కలిగి ఉండాలని ఒకటవ అడిషనల్ సివిల్ జడ్జ్ ఏ రమేష్ సూచిం చారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవం పురస్కరించుకొని పదవ జిల్లా అడిషనల్ జడ్జి ఎంఎల్ఎస్ఓ చైర్మన్ వి నరేష్ ఆదేశాల మేరకు మండలంలోని వెంకుపాలెం గ్రామంలోని ఉదయ శాంతి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూలంగా విన్నారు. వృద్ధుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వయోవృద్ధులను ఆదరించాలి

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్లు

ప్రజాశక్తి -. అనకాపల్లి: సమాజంలో సీనియర్ సిటిజెన్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారని అనకాపల్లి జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాండ్రేగుల అప్పారావు(కెప్టెన్) ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వృద్ధుల వేధింపు నివారణ దినోత్సవాన్ని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. నేటి సమాజంలో అనేకమంది వయోవృద్ధులు తమ కుటుంబ సభ్యుల నుంచి శారీరక, మానసిక భౌతిక దాడులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విధానం మారాలని, వృద్ధులను తమ కుటుంబం ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వయోవృద్ధులు పాల్గొన్నారు.

'సిఎం సహాయనిధి' పంపిణీ

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -చోడవరం : నియోజకవర్గ పరిధిలోని ఐదుగురికి సిఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.4.81లక్షల ఆర్థికసాయం చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఆదివారం చోడవరం మండలం లక్ష్మీదేవిపేట వీధికి చెందిన. నాగిరెడ్డి వరాహ మూర్తి రూ.38,727 జన్నవరం గ్రామం గుమ్మాల దేముడు రూ.65,811 రావికమతానికి చెందిన బలిజి పోర్నీష్ రూ.2,59,07, అల్లు రాజశేఖర్‌కు రూ.42,461 నర్సాపురం పిల్ల బుల్లమ్మ రూ.74,966 ఆర్థికసాయం అందించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, పేదల వైద్యానికి ఎన్‌టిఆర్ వైద్యసేవ కింద ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఉచితంగానే సేవలు అందించడంతోపాటు ఎన్‌టిఆర్ వైద్యసేవ పరిధిలోకి రాని వారికి సిఎం సహాయనిధి సాయం అందిస్తామన్నారు.

బుచ్చయ్యపేట : అనారోగ్యం బాధపడుతున్న బుచ్చయ్యపేటకు చెందిన లోక్కోజు నారాయణకు సిఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.80లక్షల సాయం చెక్కును ఆదివారం ఎమ్మెల్యే కెఎస్ఎస్ఎన్.రాజు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెలు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు డొంకిన అప్పలనాయుడు పాల్గొన్నారు

బీమా ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి-అనకాపల్లి: జీవిత బీమా ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు.బీమా ఏజెంట్లకు వ్యతిరేకంగా తెచ్చిన బీమా సుగమ్‌ను ఏజెంట్ల ఆందోళనతో వెనక్కు తగ్గిన యాజమాన్యం మళ్ళీ తెర మీదకు తెస్తుందని నాగరాజు ఆరోపించారు. స్థానిక విజయ రెసిడెన్సీలో నాగరాజు అధ్యక్షతన కార్యవర్గ సమావేశంలో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ పట్నం జిల్లాలనుండి ఏజెంట్స్ భారీ స్థాయిలో హాజరయ్యారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళన విజయవంతం కావడంపై ఆనందం వ్యకతం చేశారు.వచ్చేనెల 9న అఖిల భారత సమ్మె జయప్రదంపై సమావేశంలో చర్చించారు.

యూనియన్ జనరల్ సెక్రటరీ ఎన్ఆర్ ఠాగూర్ మాట్లాడుతూ వినియోగదారులకు బోనస్ రేట్లు పెంచాలని, వారు చెల్లిస్తున్న ప్రీమియంపై విధిస్తున్న జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. ఏజెంట్స్ గ్రూప్ ఇన్సూరెన్స్, మెడి క్లెయిమ్ పెంచాలన్నారు. క్లా బ్యాక్ అంశం మీద ఏజెంట్స్ నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. డివిజన్ ట్రెజరర్ త్రిమూర్తులు సభ్యత్వ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణబాబు, మళ్ల శ్రీరామమూర్తి, ఆడారి రామకృష్ణ, అప్పాజీ, నారాయణరావు, చోడవరం, గాజువాక ప్రెసిడెంట్‌లు మోహన్, కిషోర్,స్టేట్ కమిటీ మెంబర్ గొర్లి శంకరరావు, ఆర్ ఎస్ నాయుడు, అనకాపల్లి బ్రాంచ్ అధ్యక్షులు పెంటకోట సైదు నాయుడు, సెక్రటరీ కరణం మాణిక్యారావు, ట్రెజరర్ రొంగళి అప్పారావు, కెఎల్ఆర్‌కె నాయుడు, వైస్ ప్రెసిడెంట్లు ఐతా రాము, టి హరిబాబు, జాయింట్ సెక్రటరీలు దుర్గారావు, చిన అప్పారావు పాల్గొన్నారు.ట

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం

నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -రాంబిల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి, కార్మికుల హక్కులు, చట్టాల పరిరక్షణకు సిఐటియు ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాడుదామని యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాంబిల్లిలో సిఐటియు మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికచట్టాలకు సవరణలు చేసి, నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి యాజమాన్యాలను కార్మికులను బానిసలను చేసే చర్యలు చేపడుతోందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అదే పోరాటాలతో పరిరక్షించుకుందామన్నారు "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" పేరుతో చట్టాలకు తూట్లు పొడుతూ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచేందుకు, విశ్రాంతి, సెలవు దినాలు, రాత్రి పూట పని చేయించాలని చూస్తోందని, దీన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పెట్టుబడిదారుల అనుకూల నిర్ణయంతో రాష్ట్రంలోని ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో పనిచేసే 50 లక్షల మంది కార్మికులపై పనిభారం పడుతుందన్నారు. 13ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన చట్టసవరణలు చేయకపోవడంతో ఇప్పటికే కార్మికులంతా ఆర్థిక, శ్రమ దోపిడికి గురౌతున్నారని, పనిగంటలు పెంచితే మరింత నష్టపోతారని ఆవేదన వెలిబుచ్చారు. అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు, ఇతర ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై వచ్చేనెల 9న దేశవ్యాప్త సమ్మెలో సంఘాలకు అతీతంగా కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడునాయుడు, సిఐటియు మండల కన్వీనర్ రామకృష్ణ, భాస్కరరావు, పి మంగ, సరోజిని, మసేనమ్మ, గంగరాజు, నారాయణరావు, వరహాలరావు, రమణ, రాము, ఇల్లాయిడు పాల్గొన్నారు.

క్వారీలపై ఎంపీ కన్నుపడిందా ?

- సిఎం రమేష్ దోచుకుంటున్నారని గుసగుసలు
- మాజీ మంత్రి అమర్‌నాథ్ స్వీట్ వార్నింగ్‌తో సర్వత్రా చర్చ

ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్ : అనకాపల్లిలో క్వారీలపై ఎంపీ సీఎం రమేష్ కన్ను పడిందా, ఈ వ్యవహారంలో చక్రం తిప్పి కోట్లు వెనక వేసుకుంటున్నారా అంటే అవుననేది మళ్ళీ తెరపైకి వచ్చింది. ఎప్పటినుంచో ఈ ఆరోపణలు వినిపిస్తున్నా, ఇటీవల ఒక సమావేశంలో వైసిపి మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలతో ఆ ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఆ సమావేశంలో అమర్నాథ్ మాట్లాడుతూ క్వారీ నిర్వహణలో కూటమి నాయకులు, ప్రధానంగా ఎంపీ ఎక్కడి నుంచో వచ్చి, ఇక్కడ వారి లారీలనే వ్యాపారంలో పెడతానంటే ఎలా అని ప్రశ్నించడం, వైసిసి నాయకుల లారీలను ఆపేస్తే టైం వచ్చాక తామేంటో చూపిస్తామని స్వీట్ వార్నింగ్ ఇవ్వడంపై మళ్ళీ చర్చకు తావిస్తుంది.

నిజానికి అనకాపల్లి క్వారీల నిర్వహణలో ఎంపీ పాత్రపై కొంతకాలం నుంచి ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కడప నుంచి వచ్చిన వందల సంఖ్యలో లారీల వరకు అనకాపల్లిలో తిరుగుతున్నట్లు ప్రచారం ఉంది. ఇటీవల కాలంలో రైల్వే వంతెనను ఢీకొటింది కడప లారీయే. అంతకుముందు మునగపాక వద్ద ప్రమాదంలో ఒక వ్యక్తి చావుకు కారణమైంది కూడా కడప నుంచి వచ్చిన లారీయే కారణమనే ప్రచారానికి అమర్ వ్యాఖ్యలు ఊతం పలికాయి. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ వ్యాపారాలు చేస్తూ ఇక్కడ వారిని ఇబ్బంది పెడితే భవిష్యత్తులో వదిలేది లేదంటూ అమర్ వార్నింగ్ ఇవ్వడంతో ఆరోపణలకు బలం చేకూరుతున్నాయి. అనకాపల్లిలో క్వారీ డాన్‌గా పేరున్న వ్యక్తులు సైతం ఇపుడు ఎంపీ సీఎం రమేష్ వెనుకకు చేరిపోవడం కూడా ఆరోపణలకు ఊతమిస్తోంది.

నిజానికి అనకాపల్లిలో ఎవరు నాయకుడిగా ఎదిగినా, ఇక్కడ ప్రధాన వనరుగా ఉన్న క్వారీలు పైనే దృష్టి పెడతారన్నది బహిరంగ సత్యం. గతంలో అధికారంలో ఉన్న ఎందరో నాయకులపై ఇవే ఆరోపణలు వెల్లువెత్తాయి. అందులోనూ కొందరి నాయకుల పాత్ర ప్రత్యక్షంగానే కనిపించేది. అనుచరులతో వాటాలను కలెక్షన్ చేసే నాయకులూ గతంలో ఉండేవారు. ఇప్పుడు ఎంపీ సీఎం రమేష్ అదే తీరును కనబరుస్తున్నట్టు వైసిపి నేతల ఆరోపిస్తుండడంతో ఇపుడు ప్రజల్లో చర్చ మొదలైంది. నిజమా, అబద్ధమా అన్నది పక్కన పెడితే అమర్ వ్యాఖ్యలపై కూటమి నాయకులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి.

డిసిఎంఎస్ పూర్వవైభవానికి కృషి

చైర్మన్‌గా బాలాజీ ప్రమాణ స్వీకారోత్సవం

బాలాజీ తల్లిదండ్రులను సత్కరిస్తున్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్ : డిసిఎంఎస్ ఘన చరిత్రను దృష్టిలో పెట్టుకొని దీనికి పూర్వవైభవం తీసుకొచ్చేలా కృషి చేయాలని చైర్మన్ కోట్ని బాలాజీకి రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్ సూచించారు.ఆదివారం అనకాపల్లి పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో డిసిఎంఎస్ చైర్మన్‌గా కోట్ని బాలాజీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అతిచిన్న వయస్సులోనే బాలాజీకి డిసిఎంఎస్ చైర్మన్ పదవి వరించడం అభినందనీయమన్నారు.పార్టీలో కష్టపడిన ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చొరవతో యువకులు పదవులు దక్కించుకుంటున్నారన్నారు. చైర్మన్ కోట్ని బాలాజీ మాట్లాడుతూ అందరి సహకారంతో డిసిఎంఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బాలాజీ తల్లిదండ్రులను అతిథులుసత్కరించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు, బుద్ధ నాగజగదీష్, తాతబాబు, మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

బాలాజీకి పలువురి అభినందన

దేవరాపల్లి: డిసిఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోట్ని బాలాజీని దేవరాపల్లి మండల టిడిపి నాయకులు ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, మాజీ ప్రధాన కార్యదర్శి శరకాన సూర్యనారాయణ, చల్లా తాతయ్యలు, పెంటకోట అప్పలనాయుడు, కడిమి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కశింకోట : డిసిఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోట్ని బాలాజీని ఆదివారం కశింకోట మండలానికి చెందిన తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గోంతిని శ్రీనువాసరావు, అనకాపల్లి వైద్యాలయం అభివృద్ధి డైరెక్టర్ ఉల్లింగల రమేష్, అచ్చర్ల గ్రామ టిడిపి అధ్యక్షులు నైనంశెట్టి రమణ రావు, చిరంజీవి, నారిపిల్లి ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు.

నర్సీపట్నం టౌన్: డీసీఎంఎస్ చైర్మన్‌గా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన బాలాజీని ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా జనసేన ఉపాధ్యక్షులు చక్రవర్తి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెల్లి సంఘ నాయకులు ఎర్రంశెట్టి పాపారావు, మోపాడ సత్య ప్రసాద్, మోపాడ సోమేశ్, కరణం నాగేష్, వంశి, పసుపులేటి అప్పలనాయుడు, మోపడ చిరంజీవి పాల్గొన్నారు

బండారును కలిసిన బుచ్చిరాజు

బుచ్చిరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-సబ్బవరం. : శాప్ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన మండలానికి చెందిన అనకాపల్లి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) ఆదివారం మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి పుష్పగుచ్చం అందజేసి, దుశ్శాలువాతో బుచ్చిరాజు ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో మాజీ ఎంపిపి గండి దేముడు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, టి ఎన్ టి యు ఎస్ అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షులు రోగలి గోపాలకృష్ణ. పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లతో దశ తిరిగేనా!

- తరగతికో టీచర్, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన
- మున్సిపాలిటీ, మండలంలో 19 పాఠశాలలు ఎంపిక
- స్థాయికి తగ్గ సౌకర్యాల లేమిపైనే సర్వత్రా చర్చ

ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్ : విద్యారంగంలో కొత్త విధానానికి నాంది పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఒక్కో పంచాయతీ ఒక్కో స్కూల్'ను మోడల్‌గా రూపుదిద్దుకోనుంది. ఈ మేరకు అనకాపల్లి మున్సిపాలిటీలో ఆరు, మండల పరిధిలో 13 కలిపి మొత్తం 19 పాఠశాలలు మోడల్ స్కూల్‌లుగా ఎంపికయ్యాయి .విద్యార్థులకు అత్యాధునిక తరగతులు, ఆంగ్ల మాధ్యమ బోధన వంటి సౌకర్యాలతోపాటు నాణ్యమైన విద్యను ఈ మోడల్ స్కూళ్లలో అందించనున్నారు. ప్రతి తరగతికీ విధిగా ఒక్కో టీచర్‌ను నియమించడం ద్వారా బోధననాణ్యతను మెరుగుపర్చే దిశగా ముందడుగు పడింది. కనీసం 45 మంది విద్యార్థులున్న పాఠశాలలనే ఈ కేటగిరీలోకి ఎంపిక చేశారు. మోడల్ స్కూల్‌గా ఎంపికైన పాఠశాలల్లో మున్సిపాలిటీ పరిధిలో వుడ్‌పేట, గాంధీనగరం, నిదానందొడ్డి, గవరపాలెం పాఠశాలలు ఉండగా, మండల పరిధిలో ముత్రాస్ కాలనీ, బిఆర్టీ కాలనీ తదితర పాఠశాలలు ఉన్నాయి.

అయితే, ఈ మోడల్ స్కూల్స్‌కు ఎంపికైన పాఠశాలల్లో ప్రస్తుతానికి అవసరమైన మౌలిక వసతులు అనేక చోట్ల లేవు. ఆధునిక బోధన పద్ధతులకు అనుగుణంగా వసతి, ఫర్నిచర్, డిజిటల్ బోర్డులు, ల్యాబ్‌లు ఇతర సౌకర్యాలను సమకూర్చి అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాతైనా మోడల్ స్కూల్స్‌గా రూపాంతరం చెందిన పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, ఆధునిక బోధన సౌకర్యాలను సమకూర్చి, ఆయా పాఠశాలలను సజీవ విద్యాకేంద్రాలుగా తీర్చిదిద్దాలని విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు స్థానికులు కోరుతున్నారు.

వుడ్‌పేట ప్రాథమిక పాఠశాల

వుడ్‌పేట పాఠశాలకు పూర్వవైభవం వచ్చేనా?

అనకాపల్లిలో వందేళ్ల కిందట ప్రారంభించిన వుడ్‌పేట పాఠశాల ఒకప్పుడు ఓ వెలుగు వెలిగింది. ఈ పాఠశాలలో ఏకకాలంలో 1200 మంది విద్యార్థులు ఉండేవారంటే పాఠశాల చరిత్ర, స్థాయి అర్థం చేసుకోవచ్చు. లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఈ పాఠశాల కాలక్రమంలో అప్పర్ ప్రైమరీ నుంచి ప్రైమరీ స్థాయికి దిగజారి ఉనికికి ప్రశ్నార్థకం చేసుకోంది. తాజాగా ప్రభుత్వం నిర్ణయంతో మోడల్ స్కూల్‌గా మారడంతో పూర్వవైభవం వస్తుందాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మోడల్‌గా తీర్చిదిద్దుతా

విద్యాబుద్ధులు నేర్చిన పాఠశాలలో హెచ్‌ఎంగా రావడం ఆనందంగా ఉంది. ఇదే సమయంలో మోడల్ స్కూల్‌గా ఎంపిక కావడంతో పాఠశాల పూర్వ వైభవానికి కృషి చేస్తా. విద్యాబోధన తోపాటు విద్యార్థులకు స్వయంగా మెళకువలను నేర్పిస్తా.

- ఎం ఉమామహేశ్వరరావు,
హెచ్‌ఎం, వుడ్‌పేట పాఠశాల

ఎంపిడిఒకు తీవ్ర అస్వస్థత

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట ఎంపిడిఒ వి విజయలక్ష్మి తీవ్ర అస్వస్థతకు గురై విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. శనివారం రాత్రి తన నివాసంలో ఉన్న సమయంలో ఎంపిడిఒ విజయలక్ష్మి స్పృహ తప్పడంతో కుటుంబీకులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు 32 మంది సభ్యుల బృందం

యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు వెళుతున్న బృందం

ప్రజాశక్తి.-అనకాపల్లి : ఈ నెల 16 నుంచి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని డాన్ బోస్కో హైస్కూల్లో ప్రారంభం కానున్న యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి 32మంది సభ్యుల బృందం తరలివెళ్లింది. సోలో యోగా, గ్రూప్ యోగా, చిత్ర లేఖనం, పాటలు, పోస్టర్ డిజైన్, వ్యాసరచన తదితర అంశాల్లో ఈ పోటీలు జూనియర్స్, యంగ్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలు ఈ నెల 20న విశాఖపట్నం హాజరు కావాల్సి వుంటుందన్నారు. అనకాపల్లి జిల్లా నుంచి వెళ్లిన ఐదుగురు బాలురు, 23 మంది మహిళలు, నలుగురు అధికారులతో కలిసి మొత్తం 32 మంది సభ్యుల బృందం బయలుదేరింది. వీరికి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా క్రీడాల శాఖ అధికారి ఎల్ వెంకటరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు.

మాజీ సర్పంచ్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కరక మాజీ సర్పంచ్ ఎలంశెట్టి సత్యరావును ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, మండల టిడిపి నాయకులు గేదెల సత్యనారాయణ, గోకవాడ కోటేశ్వరరావు, డొంకిన అప్పలనాయుడు, ఎంవివి సత్యనారాయణ, ఎలంకయల అప్పలనాయుడు, కోటా సత్యనారాయణ, మలిరెడ్డి బుజ్జి తదితరులు ఆదివారం పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో వైద్యం పొంది ఇంటికి చేరుకున్నారు. కరకలోని ఆయన స్వగృహంలో సత్యారావును కలిసి పరామర్శించిన ఎమ్మెల్యే, ఇతర నేతలు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

సామాజిక భవన మరమ్మతులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామం ఎస్‌సి కాలనీలో శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారిన రెండు సామాజిక భవనాల మరమ్మతులకు ఆదివారం ఎంపిపి చింతల బుల్లి లక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యుడు కర్రి సత్యం, సర్పంచ్ దాడి జగన్నాథరావు(జగన్) శంకుస్థాపన చేశారు. కొట్టి ఎం.అలమండ ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా మారిన ఈ రెండు సామాజిక భవనాల మరమ్మత్తులకు జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.9.7 లక్షలు మంజూరు చేసినట్లు జజెడ్‌పిటిసి సభ్యుడు కర్రి సత్యం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి 'బుల్లి లక్ష్మి' మాట్లాడుతూ.. పల్లెల్లోని సామాజిక భవనాల నిర్వహణ, వినియోగం సరిగా లేకపోవడం వల్ల అవి నిరుపయోగంగా మారి పాడైపోతున్నాయన్నారు. మరమ్మతులు చేపడుతున్న ఆయా కమ్యూనిటీ హాళ్లను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పంచాడ సింహాచలంనాయుడు, వైసిపిమండల అధ్యక్షుడు బూరె బాబూరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

135 మందికి ఉచిత కంటి పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -పరవాడ : మండల పరిధిలోని ఫార్మా సిటీ కాలనీ, లేమర్తి జెడ్‌పి హైస్కూల్‌లో అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్, తెలుగుదేశం పార్టీ 85వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు.కంటి వైద్య శిబిరాన్ని ట్రస్ట్ సభ్యులు వార్డు టిడిపి అధ్యక్షులు కర్రి దశేంద్ర రావు,కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మిప్రసాద్ ప్రారంభించారు. 135మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 42 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపికచేసి ప్రత్యేక బస్సులో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. వైద్య శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు డాక్టర్ ఆర్ దుర్గాభవాని, క్యాంప్ మేనేజర్ అరుణ్ కుమార్, వైద్య సిబ్బంది, యూత్ సహాయ సహకారాలు అందించారు. ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకట రావు, వైస్ చైర్మన్ ఎస్ అర్జున, ట్రస్ట్ సభ్యులు సింగంపల్లి రామారావు, లెక్కల సత్యనారాయణ, వాలంటీర్ వి.దేవహర్షిణి , వార్డు సెక్రటరీ విందుల రాజు, మాజీ సర్పంచ్ చిమిటి అర్జున, డొక్క రమేష్, కర్రి తలుపుల నాయుడు, పి శివ రామకృష్ణ పాల్గొన్నారు.

అలమండ సర్పంచ్‌కు సత్కారం

సర్పంచ్ జగన్‌ను సత్కరిస్తున్న రైతులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : దీర్ఘకాలికంగా నిలిచిపోయిన రహదారి నిర్మాణం పనులు చేపట్టిన ఎం అలమండ పంచాయతీ సర్పంచ్ దాడి జగన్‌ను పెంటకోట వారి కల్లాల వద్ద రైతులు ఆదివారం ఘనంగా సత్కరించారు. కొన్నేళ్ళుగా రహదారి సౌకర్యం లేక పెంటకోట వారి కల్లాల రైతులు పడుతున్న ఇబ్బందులు, కష్టాలు తెలుసుకొని సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి, అభివృద్ధి చేయటాన్ని రైతులు అభినందించారు పెంటకోట వారి కల్లాల వద్ద ఉన్న 30 కుటుంబాల రైతులు తమ సొంత డబ్బులతో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ పాలక సభ్యులు రైతులు పాల్గొన్నారు

సహేతుకమైన ప్రశ్నలతో మార్పు సాధ్యం

- గ్రీన్‌క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా సదస్సులో కాండ్రేగుల వెంకటరమణ

సదస్సులో మాట్లాడుతున్న కాండ్రేగుల వెంకటరమణ

ప్రజాశక్తి-అనకాపల్లి : బాధ్యత, విషయ పరిజ్ఞానంతో సరైన ప్రశ్నలు సంధిస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అధికార దుర్వినియోగం తగ్గుతుందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు, ఆర్టీఐ, వినియోగదారుల రక్షణ చట్టాల రాష్ట్ర అవార్డుగ్రహీత కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. ఆదివారం గ్రీన్ క్లబ్ 11వ వార్షికోత్సవం సందర్భంగా 'సామాజిక సమస్యలు, పరిష్కార మార్గాలు, ఆన్‌లైన్ వేదికలు' అంశంపై గౌరీ గ్రంథాలయంలో జరిగిన సదస్సులో మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలు అమలులో తీవ్ర జాప్యం, అవినీతి, అధికార దుర్వినియోగం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్యం, విషయ పరిజ్ఞానం అవసరమని, ప్రభుత్వ శాఖల సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉండాలని స్పష్టం చేశారు

. పౌరుల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వ సిటిజన్ చార్టర్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి శాఖ నిర్దేశిత గడువులో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏ సేవ ఎంత కాలంలో జరగాలనేది చార్టర్లలో స్పష్టత ఉందన్నారు. అధికార దుర్వినియోగం సామాజిక న్యాయానికి అడ్డుగోడగా నిలుస్తుందనిఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సమస్యల పరిష్కారానికి ప్రజల భాగస్వామ్యం అత్యవసర మన్నారు. గ్రామీణ ప్రజలు డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

ఆర్టీఐ, వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాలు, రాష్ట్ర స్థాయిలో పిజిఆర్ఎస్, కేంద్ర స్థాయిలో సీపీగ్రామ్స్ ద్వారా పౌర సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కారం పొందే విధానం, ప్రభుత్వ శాఖ అందించాల్సిన సేవలు, కాల పరిమితులు, బాధ్యతల సిటిజన్ చార్టర్లు, ఆన్‌లైన్ పరిష్కార వేదికలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. గీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రోగ్రాం కోఆర్డినేటర్ కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్.ఐ.), క్లబ్ ప్రతినిధులు పెంటకోట ఉమా మహేశ్వరరావు, బీరా వినోద్‌కుమార్, రావూరి అనిత, న్కెశెట్టి సత్తిబాబు, యల్లపు సూరిఅప్పారావు, మాణిక్యం ఆనంద్, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రేషన్ డీలర్లు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం కాండ్రేగుల వెంకట రమణను గ్రీన్ క్లబ్ ఘనంగా సత్కరించింది.

అస్తవ్యస్తంగా ఉన్న రాజుపేట, ఇందేసమ్మ వాక వద్ద రహదారి

రహదారుల పనులు ప్రారంభించేదెన్నడో?

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో పలు గ్రామాల్లో రోడ్లు మరమ్మతు చేయక పోవడంతో వాహదారులు అవస్థలు పడుతున్నారు. అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల వచ్చే రహదారి పనులకు సుమారుగా 23కోట్లతో శంకుస్థాపనను సుమారు ఏడాది క్రితం ఆర్భాటంగా చేపట్టారు. కానీ నేటికీ పనులు మొదలు కాలేదు, అదేవిధంగా మండలంలో రాజుపేట నుండి మాకవరపాలెం వెళ్లే రహదారి, చౌడువాడ వెళ్లే రహదారి, అన్నవరం గ్రామానికి వెళ్లే రహదారి, వెంకటాపురం నుండి తడపర్తి, కొడవటిపూడి నుంచి గిరిజన గ్రామమైన కోదండరాంపురం, గొట్టువాడ శివారు అనుకు, అల్లుమయ్య పాలెం వద్ద అసంపూర్తిగా వదిలేసిన రోడ్లు, ఇలా మండల వ్యాప్తంగా పలు రహదారులు పూర్తిగా ఛిద్రమై దర్శనమిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వంలో నిర్మించిన కాలనీ ఇల్లు వద్ద సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు..ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పై సంబరాలను నాయకులు చేసుకుంటున్నారు సరే.. మండలంపై హోం మంత్రి అనిత చిన్న చూపు చూస్తున్నారంటూ పలువురు ఆరోపణ సైతం గుప్పిస్తున్నారు, కనీసం రహదారుల నిర్మాణమైన సక్రమంగా చేపట్టాలని మండల వాసులు కోరుకుంటున్నారు.

నిరుపయోగంగా డిజిటల్ లైబ్రరీ

ప్రజాశక్తి- కోటవురట్ల:గత ప్రభుత్వంలో కొత్త గుట్టు వాడ గ్రామంలో ఆర్భాటంగా నిర్మాణం చేపట్టిన డిజిటల్ లైబ్రరీ భవనం వృధాగా దర్శనమిస్తుంది, 16 లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన భవనం 2023 సంవత్సరంలో నాటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభోత్సవం చేపట్టారు. మండల వ్యాప్తంగా గొట్టువాడ, కోటవురట్ల పీకే పల్లి, కె.వెపూడి, వెంకటాపురం పాములవాక, గ్రామాలలో భవనాలు మంజూరు అయినప్పటికీ కొత్తగొట్టు వాడ గ్రామంలో మాత్రమే నిర్మాణం పూర్తి చేశారు. నిర్మించిన ఆ భవనం కూడా నాటి నుంచి నేటి వరకు లైబ్రరీ వినియోగం లోకి తీసుకురాక పోవడం విశేషం. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని వృధాగా వదిలేయడం పట్ల గ్రామస్తులు మండల వాసులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు, కూటమి ప్రభుత్వంలోనైనా భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని కోరుకుంటున్నారు.

నిరుపయోగంగా ఉన్న డిజిటల్ లైబ్రరీ

యోగా సాధనతో ఆరోగ్యం

యోగా చేస్తున్న డిఐపిఆర్ఓ, కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రతిఒక్కరూ రోజూ యోగాసాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతోపాటు ఆరోగ్యం సమకూరుతుందని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్‌వి రమణ అన్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్ వి రమణ ఆధ్వర్యంలో సెలబ్రిటీ యోగా నిర్వహించారు. ఏషియన్ బ్రాంజ్ మెడలిస్ట్ బాక్సర్ కుసుమ, ఇతర ప్రముఖులు, సమాచార శాఖ సిబ్బందితో కలిసి యోగా నిర్వహించారు.యోగా గురువు మంగియ్య యోగా శిక్షకులు జ్యోతి, లక్ష్మి యోగాలోని ఆసనాలు బ్రీతింగ్ టెక్నిక్స్ చేసి చూపించి అందరితో యోగాసనాలు వేయించారు. సహాయ సమాచార ఇంజనీర్ బాలాజీ, జూనియర్ సహాయకులు పిడిఎస్ఎన్ మూర్తి, సమాచార శాఖ సిబ్బంది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

అవగాహనా ర్యాలీ

మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే యోగ ఒక్కటే మార్గమని పతంజలి యోగ సమితి భారత స్వామి ట్రస్ట్ అధ్యక్షులు భీశెట్టి దొరమ్మ నాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిరోజు యోగ సాధన ద్వారా అనేక శారీరక మానసిక రుగ్మతల నుంచి దూరం కావచ్చన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు జి మంగయ్య, బి నరసింగరావు, మాదేటి జనార్ధన్, జార్జ్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బివిఎస్ ఎం కె జోగి నాయుడు, బుద్ధ కాశి విశ్వనాథ్, కె నరసింహారావు, కెవివి సత్యనారాయణ, కాంగ్రెసుల చిన్న, కోలపర్తి కన్న బాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, రోహిణి పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండలం బుచ్చంపేట మాజీ ఉప సర్పంచ్ మాకిరెడ్డి లక్ష్మణమూర్తి మనవడు అల్లు రాజేష్‌కు సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.42461 చెక్కును ఆదివారం చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యపరంగా ఉన్న వ్యక్తులకు ఈ సహాయనిధి చెక్కులు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నగదు ఇస్తున్న వైసిపి నేతలు

బాధిత రైతుకు రూ.10 వేలు సాయం

ప్రజాశక్తి - చీడికాడ:ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి పిడుగుపాటు ప్రమాదానికి రెండు ఆవులు కండివరం గ్రామంలో శనివారం మృతి చెందాయి. జనపరెడ్డి కళ్యాణం అనే రైతుకు సంబంధించిన రెండు ఆవులపై పిడుగులు పడడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు మండల పార్టీ నాయకులు బాధితుడికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొల్లవెల్లి రాజబాబు, మండల పరిషత్ అధ్యక్షులు కూరచా జయమ్మ నారాయణమూర్తి, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సిడిసి చైర్మన్, జిల్లా వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షులు గొల్లవెల్లి స్వామి నాయుడు, వైస్ ఎంపిపి ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, ఎంపిటిసి గెంజి బాలాజీ, కో ఆప్షన్ ఎంపిటిసి షేక్ సూర్య నారాయణ, మొసూరి సన్నిబాబు పాల్గొన్నారు.

సిసి కెమెరాలు అందజేస్తున్న దాతలు

ఆలయానికి సిసి కెమెరాల వితరణ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని రేబాక గూడపమ్మ ఆలయానికి ఎస్.రాయవరం మండలం గోకులపాడుకు చెందిన జనసేన నాయకులు మత్తి కార్తీక్ 4 సీసీ కెమెరాలను ఆదివారం ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజుకు అందజేశారు. ఇటీవల ఆలయంలో భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా, ఆలయ భద్రత కోసం సుమారు రూ.28వేలు విలువైన 4 సీసీ కెమెరాలను, అందుకు తగ్గ సాంకేతిక పరికరాలను అందజేశారు. ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు కార్తీక్ ను అమ్మవారి శేషవస్త్రం తో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శనాపతి అప్పారావు, విజయ్ కుమార్, ఎస్ఎస్ఎఫ్ జిల్లా మహిళా ధర్మ ప్రచారక్ కె.లలిత, గోకులపాడు జనసేన నాయకులు నక్కా శ్రీనివాస్, గొర్లె సురేశ్, ప్రగడ దుర్గా ప్రసాద్, పిల్లి నగేష్, మాలెం రమణబాబు, ధనబాబు, ఎ.రవి పాల్గొన్నారు.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే..

యోగా కార్యక్రమానికి తరలిరావాలి

- ప్రయివేటు వాహనాలకు అనుమతి లేదు- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఈ నెల 21న నగరంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడి పాల్గొంటున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కోరారు. బీచ్ రోడ్డులో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగ దినోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లపై నగరానికి చెందిన ప్రజాప్రతినిధులతో ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు విషయాలను వివరించారు.ప్రజలు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటు చేసిన బస్సులు, ఆటోలు,టాటా మేజిక్ వంటి వాహనాల్లో మాత్రమే ప్రయాణించి బీచ్ రోడ్డులో తమకు నిర్దేశించిన ప్రాంతానికి చేరుకోవలసి వుంటుందని, ప్రైవేటు వాహనాలను అనుమతించబోమని స్పష్టంచేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాలకు ప్రజలను సకాలంలో తరలించడం ముఖ్యమని దీనికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ప్రజాప్రతినిధులకు సూచించారు. ఆయా ప్రాంతం వారు 21న తెల్లవారుఝూమున ఆ ప్రాంతానికి చేరుకొనేలా స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేయాలని కోరారు. బస్సులకు వార్డు సచివాలయం కార్యదర్శులను ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నామని తెలిపారు.ఆయా వార్డుల నుంచి మహిళలు, యువత ఎక్కువగా పాల్గొనేలా చర్యలు చేపట్టాలని కోరారు.జిల్లాలో ప్రజలను తరలించేందుకు 2085 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు.ఇందులో ఆర్టీసీ బస్సులు 1300 వినియోగిస్తున్నట్టు పేర్కొన్నారు.800 బస్సులను పట్టణ ప్రాంతాల్లో ప్రజల తరలింపు కోసం, గ్రామీణ ప్రాంతం నుంచి తరలింపుకోసం 500 బస్సులు వినియోగిస్తామన్నారు. మరో 885 ప్రైవేటు బస్సులను కూడా వినియోగించనున్నట్టు చెప్పారు. ఈ బస్సులన్నీ 20 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకే ఆయా నియోజకవర్గాలకు చేరుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.ఈ బస్సుల్లో వచ్చే వారంతా తెల్లవారు ఝూమున 5 గంటలకు తమకు కేటాయించిన ప్రదేశాలకు చేరుకొని మార్కింగ్‌లో నిలబడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. యోగ కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ ఉచితంగా టీషర్టులు, మేట్‌లు అందజేయనున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ యోగ దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడి 21 న ఉదయం 6.30 గంటలకే బీచ్ రోడ్డులోని వేదిక వద్దకు చేరుకొని కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందురోజే నగరానికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ యాదవ్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విఎంఆర్ డిఎ. చైర్మన్ ప్రణవ్ గోపాల్, కార్పొరేషన్ చైర్మన్‌లు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, బిజెపి నాయకులు పరశురామరాజు, ఆర్‌టిసి ఆర్ఎం బి. అప్పలనాయుడు, డిటిసి జయప్రకాష్, యుసిడి పిడి సత్యవేణి, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరక్టర్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

ల్యాప్‌టాప్‌ను ఇస్తున్న అశోక చక్రవర్తి, శ్రీనివాసరావు

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట గ్రామానికి చెందిన బొడ్డపాటి నళిని దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీలో మూడవ సంవత్సరం (ఇసిఇ) చదువుతోంది. చదువులో ప్రతిభ కనబరుస్తూ అధ్యాపకులు, సహచర విద్యార్థుల మన్ననలు పొందుతోంది. ఈ విషయం తెకుసుకున్న పాల్మేన్ పేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మత్స్యకార యువ నాయకులు మైలపల్లి అశోక చక్రవర్తి 15 వేలు రూపాయలు అందజేయగా, శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేమాల శ్రీనివాసరావు (ఎన్ ఎస్ ఆర్) తమ స్ఫూర్తి ఫౌండేషన్ సహాయ నిధి నుంచి 15 వేలు రూపాయలు జమ చేసి మొత్తం 30 వేలు రూపాయలు ఖరీదు గల లాప్ టాప్ ను ఆదివారం పాయకరావుపేట లో అందజేశారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నళినిని ఆశీర్వదించారు. ఈ సంధర్భంగా తనకు ఎంతో విలువైన లాప్ టాప్ ను అందజేసిన అశోక చక్రవర్తి, శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేమాల శ్రీనివాసరావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేమాల నాగమణి (బుజ్జి), స్ఫూర్తి సైనిత, నేమాల గంగాధర్ యాదవ్, ముత్తి మురళి పాల్గొన్నారు.

ప్రారంభ కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్

వడ్లపూడిలో 'గ్రామీణ హోం ఫుడ్స్' ప్రారంభం

ప్రజాశక్తి - ఉక్కునగరం :జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడిలో ఏర్పాటు చేసిన గ్రామీణ హోం ఫుడ్స్ దుకాణాన్ని వార్డు కార్పొరేటర్ బొండా జగన్ ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన పిండివంటలు అందించి అందరి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ హోం ఫుడ్స్ నిర్వాహకులు దాడి సురేష్ బాబు, ద్రాక్షాయిణి మాట్లాడుతూ తమ వద్ద అన్ని రకాల పిండి వంటలు, పచ్చళ్లు, పొడులు అనువైన ధరలకే లభ్యమవుతాయని తెలిపారు. నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అచ్చమైన గ్రామీణ వంటకాలను నగర వాసులకు పరిచయం చేసేందుకు తాము ముందుకొచ్చినట్టు వెల్లడించారు. ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి కోమటి శ్రీనివాసరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

5జి వాణిజ్య సేవలు ప్రారంభించిన విఐ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శామ్ సంగ్ సహకారంతో టెలికాం ఆపరేటర్ వొడాఫోన్ ఐడియా వాణిజ్యపరమైన 5జి సేవలను ప్రారంభించినట్టు విఐ విశాఖ బ్రాంచ్ హెడ్ జగ్బీర్ సింగ్ తెలిపారు. ఆదివారం ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు.

'తల్లికి వందనం'లో షరతులు సరికావు

ప్రజాశక్తి-హుకుంపేట:నిబంధనల పేరిట అర్హులైన తల్లికి వందనంలో కోతలు విధించడం అన్యాయమని గిరిజన మహిళా సంఘం జిల్లా కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హైమావతి మాట్లాడుతూ, స్కీం వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు కూడా ఈ పథకం వర్తింప చేయాలన్నారు. ఎన్నికల హామీలో భాగంగా అ ందరికీ వర్తింప చేయాలన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-గొలుగొండ:కూటమి ప్రభుత్వం చెప్పిన హామీలో భాగంగా రాష్ట్రంలో తల్లికి వందనం కార్యక్రమం అమలు చేయడంపై గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం గ్రామంలో టీడీపీ నాయకులు, మహిళలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ బెల్లపు కొండలరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు జలమూరి రాజేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుసుకుంటూ ముందుకు దూసుకెళ్తుందని, తల్లికి వందనం హామీ చదువుతున్న పిల్లల అందరి అకౌంట్లో డబ్బులు పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

'వెన్నుపోటు' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి -పాడేరు: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసిన మోసాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన "వెన్నుపోటు" పుస్తకాలు ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జిల్లా కేంద్రంలో పాడేరు శాసన సభ్యులు, అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు, అరకు శాసన సభ్యులు రేగం మత్యలింగం . వైసీపీ నాయకులు పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, నవరత్నాల పథకాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేశారని, ఈ పథకాలను చంద్రబాబు నిర్వీర్యం చేశారన్నారు, కానీ మోసానికి మారుపేరు చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు మరొక్కసారి వెన్నుపోటు పొడిచి, సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు, ప్రజల పక్షాన నిలుస్తూ ప్రభుత్వానికి నిలదీస్తే వైఎస్ఆర్సిపి నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి అమర్‌నాథ్ పరామర్శ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన చింతపాక సర్పంచ్ గోలజాన శీను సోదరుడు గోలజాన చిన్న కుటుంబంను మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదివారం పరామర్శించారు. చిన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న కుటుంబం ను పార్టీ అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ దొండా రాంబాబు, వైసిపి మాజీ మండల పార్టీ అధ్యక్షులు జోగా కొండబాబు, కోరుకొండ అప్పలనాయుడు, గోపిశెట్టి శ్రీను, ఎల్లపు విజయ్ కుమార్, గోకివాడ వరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న అమర్‌నాథ్

104 ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని 104 ఉద్యోగుల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. 104 రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా 104 ఉద్యోగులు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్ సూర్యనారాయణ పడాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో 104 సర్వీస్‌లను గతంలో అరబిందో యాజమాన్యం నిర్వహించిందని, ఈ సంస్థ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు రావాల్సిన బకాయి వేతనాలు ఇతర బకాయిలు (ఈఎల్ గ్రాట్యుటీ) చెల్లించాలన్నారు.
జిల్లా కార్యదర్శి రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ, ప్రస్తుతం 104 సర్వీస్‌లు నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతీ నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేసారు. జిల్లా ఉపాధ్యక్షులు పవన్ కుమార్ మాట్లడుతూ, ప్రస్తుతం జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో మ్యూచువల్ బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలన్నారు. వాహనాలు గత ఐదు సంవత్సరాల నుండి మరమ్మతులకు నోచుకోలేదని, వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు.

మాట్లాడుతున్న సూర్యనారాయణపడాల్

104 ఏ ఎస్ ఆర్ జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ పడాల్ మాట్లాడుతూ, ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ప్రతీ నెలా అన్నీ జిల్లాలో కూడా గ్రేవెన్స్ మీటింగ్ నిర్వహించి సమస్యలు పరిస్కారంకి చొరవ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డివిజన్ నాయకులు భీమరాజు, అప్పలరాజు, శ్రీనివాస్, నవీన్ కుమార్, గణపతి, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.